పండగ పూటా పస్తులేనా...

- గోపాలమిత్రలకు 8 నెలలుగా జీతాలు రాలే..
- తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర జేఏసీ కన్వీనర్ రవీందర్



అధర్ సిన్హాకు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర జేఏసీ నాయకులు

పంజాగుట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు గత 8 నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పండగ పూట కూడా పస్తులు ఉండే పరిస్థితి ఉందని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర జేఏసీ కన్వీనర్ మారబోయిన రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హాకు జేఏసీ నాయకులతో కలిసి వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ 8 నెలల నుంచి వేతనాలు రావడం లేదని పలుమార్లు ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటుంటే తాము, తమ కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవతున్నామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జేఏసీ నాయకులు మల్లేశం గౌడ్, అశోక్ గౌడ్, తదితరులు ఉన్నారు.



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేసిన మోహన్‌దాస్ తదితరులు

జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ముగ్గుల పోటీలు

ఖైరతాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు జరిగాయి. భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఈయూ) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలతో పాటు పాల్గొన్న అందరికీ బహుమతులు అందజేశారు. బీఎంఈయూ అధ్యక్షులు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, మెహదీపట్నం, కార్వాన్ సర్కిళ్లకు చెందిన మున్సిపల్ ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతిని ఖైరతాబాద్ సర్కిల్‌కు చెందిన గంగాబాయి గెలుచుకోగా రెండో బహుమతిని మెహదీపట్నం సర్కిల్‌కు చెందిన నందిని నవనీత, మూడో బహుమతిని ఖైరతాబాద్ సర్కిల్‌కు చెందిన ఎ.మాధవి గెలుచుకున్నారు. యూనియన్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ఎ.మోహన్‌దాస్, కార్యదర్శి యాదగిరి, నాయకులు బహుమతులను అందజేశారు. ఇందులో యూనియన్ నాయకులు నాగభూషణం, సర్కిళ్ల కార్యదర్శులు బాల్‌రాజు, వెంకటస్వామి, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పంజాగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని శ్రీనిధి స్వీట్ ఏంజిల్స్ పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు భోగి మంటలు వేసి, గొబ్బెమ్మలు చేసి, ముగ్గులు వేసి, బొమ్మరిల్లు కట్టి, చిన్నారులకు భోగి పళ్ళుపోసి సందడి చేశారు. హరిదాసుల కోలాటం, గంగిరెద్దుల ఆటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నృత్యప్రదర్శనతో అలరించారు. విద్యార్థులు గాలిపటాలు తయారు చేసి ఎగురవేశారు. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు లక్ష్మణ్ రావు, గితా లక్ష్మణ్, కృష్ణవేణి సుకుమార్, ప్రిన్సిపాల్ గిత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, ఉపాధ్యాయులు సాయిరాం, శ్రీలక్ష్మి, స్రవంతి, అమీనా, ప్రీతి, తదితరులు పాల్గొన్నారు.

'రామాంజనేయస్వామి' హుండీ ఆదాయం రూ.95,429

పంజాగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని శ్రీ రామాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడున్నర నెలలకు గాను మొత్తం 95,429 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓలు జి.సత్యనారాయణ నాయుడు, కృష్ణ తెలిపారు. అర్చకులు దీక్షితులు, వెంకటరత్నం, భక్తులు ప్రసాద్ శర్మ, మధుకర్, లక్ష్మీపతి, అప్పల నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రగడ్డ శాంతి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటా మల్లేష్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు సనత్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం చైర్మన్ ఎం.నారాయణస్వామి, వైస్ చైర్మన్ డి.సంజీవ, సభ్యులు సి.నర్సింగ్ రావు, మల్తుంకర్ మహేందర్, డాక్టర్ రవీందర్, ఖలీల్, ధారాసింగ్, జి.రఘు, అహ్మద్, శ్రీనివాస్, దయానంద్, వంశీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– ఎర్రగడ్డ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

- కోదండరాంకు వీఆర్‌ఏల వినతి



గత ప్రభుత్వం వీఆర్‌ఎల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ నెం. 81, 85, 98లను రద్దు చేసి కొత్త జీవోలను తీసుకొచ్చి 55 నుంచి 61 సంవత్సరాల వయస్సు గల వృద్ధ వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కోదండరాంకు గురువారం వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

– బేగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

- అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



యూసుఫ్‌గూడ వెంకటగిరిలోని విజయ కనకదుర్గ పోచమ్మ ఆలయంలో అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలకు పూజలు నిర్వహించి, కాలనీలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంచుతున్న జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, తదితరులు.

– యూసుఫ్‌గూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దు

- జీవో నెం. 55ని వెనక్కి తీసుకోవాలి
- చర్చా కార్యక్రమంలో వక్తలు



అభివాదం చేస్తున్న హైకోర్టు పరిరక్షణ సమితి, వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని రాష్ట్ర హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కేటాయించొద్దని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 55ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైకోర్టు మార్పుతో న్యాయవాదులతో పాటు పర్యావరణానికి, పరిశోధనలకు జరిగే నష్టంపై చర్చ జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు వాసుదేవ్, ఉస్మానియా న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సమితి ప్రతినిధి మల్లేష్ యాదవ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ తిరుపతి, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు సత్యమూర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఫణీంద్ర భార్గవ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా, ఎవరితో చర్చించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. హైకోర్టు భవన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, రాష్ట్ర విభజన తరువాత ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం సరిపోతుందని, పార్కింగ్ సమస్య ఉంటే బహుళ అంతస్తుల భవనం కట్టి అందులో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవచ్చని వారు సూచించారు. ఇంత ఆఘమేఘాల మీద నిర్ణయం ఎందుకు తీసుకున్నారని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టుకు వెళ్లడానికే నానా ఇబ్బందులు పడుతున్నారని, రాజేంద్రనగర్‌కు తరలిస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవన్నారు. విశ్వవిద్యాలయాన్ని విధ్వంసం చేసే కుట్రలను అడ్డుకుంటామని వారు అన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం మరో వందేళ్లు ఉంటుందని, అవసరమైతే అదే ప్రాంగణంలోనే నూతన భవనాలు నిర్మించవచ్చని అన్నారు. జీవో 55ను వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని వారు అన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకుడు కమల్ సురేష్, రాజు, శ్రీనివాస్, వికాస్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: తలసాని



వివిధ శాఖల అధికారులతో కలిసి కుమ్మరి బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. గురువారం తలసాని అమీర్‌పేట డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కుమ్మరి బస్తీకి మంజూరైన వాటర్, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తి అయితేనే రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఈఈ ఇందిర, డీఈ మోహన్, ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ, స్ట్రీట్ లైట్స్ డీఈ కిరణ్మయి, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, నర్సింహ, టిల్లు, సుమిత్ సింగ్, గోపీ, లలితా చౌహాన్, ఉత్తమ్ కుమార్, గులాబ్ సింగ్, హరిసింగ్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



కాలనీ వాసులతో సమావేశమైన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. షేక్‌పేట డివిజన్ ద్వారకానాథ్ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి సమస్యలు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ ఎన్నికల ముందు నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో ఇప్పటికే కొన్ని పనులు మొదలవ్వగా, చాలా పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించే ప్రక్రియలో ఉన్నాయని అన్నారు. త్వరలోనే ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, నాయకులు, శ్రీనివాస్, సాయిగౌడ్, రామకృష్ణ, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పాటిగడ్డలో పవర్‌బోర్ ప్రారంభం



పాటిగడ్డలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి...

బేగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో నూతనంగా వేసిన పవర్‌బోర్‌ను మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎస్‌బీటీనగర్, వడ్డెరబస్తీ, ధోబీఘాట్ వద్ద నిర్మించిన ప్రహరీని పరిశీలించారు. నీటి కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నామని, పవర్ బోర్ వేయాలని వెడ్డెర బస్తీ వాసులు ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే బోరు వేసేలా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విథున్ జైన్, నందు, రాజేష్, ఉమ, శ్రీలత, జంగయ్య, నర్సింహ, నరేష్, రేణుకా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1200 కోట్ల బకాయిలను చెల్లించండి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన



ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

ఖైరతాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్ల బకాయిలను జీహెచ్‌ఎంసీ వెంటనే విడుదల చేయాలని జీహెచ్‌ఎంసీ చిన్నకాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. గురువారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, నాసర్ అలీఖాన్ మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో దాదాపు 3వేల మందికి పైగా కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో తమతో పాటు తమపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో కాంట్రాక్టర్ కింద దాదాపు 20 కుటుంబాలు ఆధారరపడి జీవిస్తున్నాయని, వాపోయారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తూ చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను నిలిపివేయడంతో తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్రాంతి లోపు తమ బిల్లులను విడుదల చేయకపోతే పనులను ఎక్కడికక్కడే నిలిపివేస్తామని వారు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆరిఫ్ అహ్మద్, లక్ష్మయ్య, పి.జనార్దన్ తదితరులు ఉన్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర సాధకులుగా గుర్తించాలి

బంజారాహిల్స్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 1969 తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర సాధకులుగా ప్రభుత్వం గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు మాజీ మంత్రి మేచినేని కిషన్ రావు డిమాండ్ చేశారు. ఇందుకోసం చట్టబద్ధమైన కమిటీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేచినేని కిషన్ రావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 250 గజాల ఇంటి స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, అందుకు సంబంధించిన నియమనిబంధనలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యమకారులు దాదాపు 75 శాతం మంది మృతి చెందారని, ఉన్న వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకొని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఉద్యమకారులందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. 1969 ఉద్యమకారుల చరిత్రను భావితరాలకు తెలియజేసేలా 100 ఎకరాల స్థలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కేటాయించి స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమ సమితి సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్ రావు, నేతలు ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి, మంకాల రాజిరెడ్డి, వనం చంద్రమౌళి పాల్గొన్నారు.



సమావేశంలో 1969 ఉద్యమ కారుల సంఘం నాయకులు

'చర్చిగల్లీలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా'

పంజాగుట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ చర్చిగల్లీలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ దేదీప్య అన్నారు. గురువారం ఆమె జలమండలి అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు జింకా అలీస్, బిట్ల సుశీల్‌తో కలిసి చర్చిగల్లీలో పర్యటించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రిన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కిషోర్ కుమార్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు 11కేవీ జెక్ కాలనీ, ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ సీతారామయ్య టవర్స్, న్యూ శాస్త్రి నగర్, విమానాశ్రయం, బేగంపేట పోస్ట్ ఆఫీస్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలో..

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ మీనాక్షి, అపోలో ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు 11కేవీ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5, రామానాయుడు స్టూడియోస్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ లోటస్ పాండ్, టీవీ 5 ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో కచ్చితమైన ప్రణాళికలతో పని చేయండి



దీపాదాస్ మున్షికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అజారుద్దీన్

బంజారాహిల్స్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో కచ్చితమైన ప్రణాళికలతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తనకు సూచించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ అజాహరుద్దీన్ తెలిపారు. గురువారం దీపాదాస్ మున్షీతో అజారుద్దీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పని చేసి హైదరాబాద్‌తో పాటు సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని గెలవాలని ఆమె సూచించారని అజారుద్దీను తెలిపారు.

మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..

- భారీ చెట్టెక్కి యువకుడి హల్‌చల్



చెట్టుపై యువకుడు

బౌద్ధనగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..' అంటూ ఓ యువకుడు భారీ చెట్టు ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి అతడిని అతికష్టం మీద కిందికి దించారు. అతడి మాటలను బట్టి మతిస్థిమితం లేనట్లుగా గుర్తించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌టాకీస్ గల్లీ వద్ద ఓ యువకుడు అతిపెద్ద చెట్టు ఎక్కి, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చిలకలగూడ పోలీసులకు సమాచారం దింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్‌ఎస్సై బాలరాజు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. చెట్టు దిగమంటూ అతడిని కోరారు. చెట్టుపై ఉన్న యువకుడు ఏదేదో మాట్లాడుతున్నాడు. అతడిని మాటల్లో పెట్టి డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది క్రేన్ సహాయంతో కిందికి దించారు. వివరాలు అడిగితే తనపేరు రబీందర్, ఛత్తీస్‌గఢ్ అని చెప్పాడు. చెట్టు ఎందుకు ఎక్కావు అంటే తమ ఫ్యామిలీ చెట్టుపై ఉందంటూ ఇది నాగపూర్ కాదా.. అని పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడిని చాకచక్యంగా కిందికి దించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

విద్యార్థులకు మెడికల్ కిట్లు పంపిణీ

ఖైరతాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయమై జాగ్రత్తలు పాటించాలను కార్పొరేటర్ విజయారెడ్డి సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు ఎమర్జెన్సీ మెడికల్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. బేగంపేట కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వారు వీటిని స్పాన్సర్ చేశారు. అత్యవసర సమయాల్లో వీటిని వినియోగించే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కార్పొరేటర్ సూచించారు.



కృష్ణనగర్‌లోని ఓ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో హరిదాస్ వేషధారణలో ఓ విద్యార్థి

– యూసుఫ్‌గూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



వైఏసీ క్యాలెండరును ఆవిష్కరిస్తున్న డా. వర్రె వెంకటేశ్వర్లు, తదితరులు

పంజాగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యువతకు మార్గదర్శకులు స్వామి వివేకానంద అని, ఆయనను ఆదర్శంగా తీసుకొని యువతరం ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీఐ మాజీ చీఫ్ కమిషనర్ డా. వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఎర్రమంజిల్‌లోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్(వైఏసీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. అవినీతి రహిత సమాజం కోసం యువతరాన్ని ఏకం చేసే దిశగా ముందుకు నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర, సభ్యులు రమేశ్ బాబు, రియాజ్ పాల్గొన్నారు.

పర్మిట్ రూంలో తినుబండారాల అమ్మకం

- రెండు వైన్‌షాప్‌లపై కేసు

బంజారాహిల్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూంలో తినుబండారాలు అమ్ముతున్న రెండు వైన్ షాపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్‌లోని కాలభైరవ వైన్స్, గౌరీశంకర్ వైన్స్‌కు పర్మిట్ రూంలు ఉన్నాయి. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూంలో తినుబండారాలు అమ్ముతున్నారు. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి తినుబండారాల అమ్మకాలు వాస్తవమేనని తేల్చి రెండు వైన్ షాపులపై ఐపీసీ 269,36(1)(బీ)(సీ) కింద కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ శాఖ చేయాల్సిన పనులను పోలీసులు చేస్తుండటంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాలికపై ఆగని వేధింపులు

- దంపతులపై కేసులు నమోదు

యూసుఫ్‌గూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించినందుకు ఓసారి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ వేధింపులకు పాల్పడుతున్న దంపతులపై మరోసారి మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో నివసించే ఓ వ్యక్తి కుమార్తెను గతేడాది సెప్టెంబర్ నెలలో ఆంజనేయులు, రామేశ్వరి(రమ) దంపతులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనలో రామేశ్వరిపై కిడ్నాప్ కేసు, ఆంజనేయులుపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, నిందుతులు బెయిల్‌పై బయటకు వచ్చారు. బాధిత బాలిక స్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు ఆంజనేయులు, రామేశ్వరి ఇద్దరు వెంబడిస్తున్నారని, ఫోన్ చేయాలని సైగ చేస్తున్నారని ఈ నెల 10న కౌన్సెలింగ్ సందర్భంగా బాలిక తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు చేయటంతో మధురానగర్ పోలీసులు మరోసారి వారిపై అవే కేసులు నమోదు చేశామని ఎస్సై శివకుమార్ తెలిపారు.

ఉస్మానియా మార్చురీలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు

ఖైరతాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యమవ్వగా పోలీసులు ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న ప్రసాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న ఫుట్ పాత్‌పై సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా లభించకపోవడంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. మృతుడు 5.7 అడుగుల ఎత్తు, చామన చాయ రంగులో ఉంటాడని, వయస్సు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మరో కేసులో ఈ నెల 10న ఖైరతాబాద్ బుడగ జంగం బస్తీలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి 108కి సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరీక్షించి మరణించాడని నిర్ధారించారు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఇతడి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తులో, చామనచాయరంగులో ఉంటాడని తెలిపారు. ఈ మృతదేహాలకు సంబంధీకులు ఎవరైనా ఉంటే ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గాని, ఫోన్ నెంబరు8712661531, 8712665185లో సంప్రదించాలని శ్రీరాములు కోరారు.



రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని చూపుతున్న రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఎస్పీ సలీమా

రైళ్లలో చోరీలు - నిందితుడి అరెస్టు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో మహిళా ప్రయాణికురాళ్ల మెడలో బంగారు గొలుసును తెంపుకుని పారిపోతున్న నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడి నుంచి 14.3 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఎస్పీ సలీమా వివరాలను వెల్లడించారు సికింద్రాబాద్ బోయగూడ ప్రాంతానికి చెందిన ఆకాశ్ (23) జెప్టో డెలివరీ బాయిగా పనిచేస్తున్నాడు. సులువుగా డబ్బు సంపాదించేందుకు నేరాల బాట పడ్డాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లిపోయాడు. అదేవిధంగా లింగంపల్లి రైలులో ఓ మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయాడు. వరుస ఫిర్యాదులు అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రైల్వే స్టేషన్‌లో మాటు వేశారు. నగలు పోగొట్టుకున్న బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్ బోయగూడకు చెందిన ఆకాశ్ అనే వ్యక్తి ఈ నేరాలకు పాల్పడ్డట్లు విచారణలో వెల్లడైంది. ఎట్టకేలకు విస్వసనీయ సమాచారం మేరకు నిందితుడు ఆకాశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు ఆకాశ్ మాట్లాడుతూ డబ్బు చాలా అవసరం ఉందని, ఇంటి పరిస్థితుల కారణంగా నేరాలు చేయాల్సి వచ్చిందని చెప్పాడు. నిందితుడి నుంచి 14.3 తులాల బంగారు ఆభరణాలు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సివరేజీ పైపులైన్ పనుల పరిశీలన

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి నుంచి జోషికాం పౌండ్ వరకు జరుగుతున్న సివరేజీ పైపులైన్ నిర్మాణపనులను గురువారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పరిశీలించారు. దాదాపు ముప్పైఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో ఈపనులను చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మనోహర్, జలమండలి మేనేజర్ అన్విత్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

రంగోలి మన సంస్కృతిలో భాగం

ప్రధానోపాధ్యాయురాలు సంతోషమ్మ

తిరుమలగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పయోనీర్ బజార్ బొల్లారంలో గురువారం సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలు ప్రాధానోపాధ్యాయుడు ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులు పరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన ప్రథమ ఉపాధ్యాయురాలు సంతోషమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగోలి మన సంస్కృతిలో ఒక భాగం అని, దాన్ని ముందు తరాలకు అందించటానికి అందరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సదర్ బజారు ప్రథమ ఉపాధ్యాయురాలు శ్రీలత పిల్లల ముగ్గుల పోటీలు చూసి అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంతేశ్వరి, సరళాదేవి, వరలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.



ఏసీపీ వెంకటరెడ్డిని సత్కరిస్తున్న అరుణకుమారి దంపతులు

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిలకలగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్‌మోసాలు రోజు, రోజుకీ పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని దిల్‌సుఖ్‌నగర్, సైబర్‌క్రైమ్ డీసీపీ అరవింద్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసగాళ్ల బారినపడి సైనిక్‌పురికి చెందిన అరుణకుమారి బాంక్ ఖాతా నుంచి 1,77,000వేల రూపాయలు కాజేశారు. 1932కి ఫోన్ చేసి కంప్లయింట్ బుక్ చేయగా స్పందించిన పోలీసులు రెండు గంటల్లోనే 92000వేలు బ్యాంక్‌లో ఫ్రీజ్ చేసినట్లు సందేశం పంపారు. తరువాత పోగొట్టుకున్న సొమ్ము మెత్తం 1,77,000వేల రూపాయలు అమెకు అంజేసేట్లు చర్యలు చేపట్టారు. అరుణ కుమారి దంపతులు గురువారు దిల్‌సుఖ్‌నగర్, సైబర్‌క్రైమ్ పోలీసుల పనితీరుకి ఆనందం వ్యక్తం చేసి మిఠాయిలు అందజేసి ఏసీపీ వెంకటరెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ సోము వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధు కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ సీ.హెచ్. ప్రవీణ్ కుమార్, జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

ఎస్సార్ నగర్‌లోని నారాయణ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ముగ్గులు వేసి గొబ్బెమ్మలను అలంకరించారు. ఎజిఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలన్నారు. ఆర్‌ఐ మాధవరెడ్డి, ప్రిన్సిపాల్ మెహరున్నీసా, ఎట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

\- ఎస్ఆర్‌నగర్, ఆంధ్రజ్యోతి

ఊరికి వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్తున్నారా.. తస్మాస్ జాగ్రత్త.. మీరు ఊరికి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మీ ఇళ్లు దొంగలబారి నుంచి పడకుండా సేఫ్‌గా ఉంటారని పోలీసులు చెబుతున్నారు. మేజర్ దొంగతనాలు కాకుండా చిన్న, చిన్న దొంగతనాలు ఎక్కువగా జరగటంతో చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేయటం లేదు. దీంతో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడేవారు రెచ్చిపోతున్నారు. దొంగతనాలు చేసేవారు ముందుగా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలున్నాయే లేదో చూసుకుని మరీ చోరీలకు పాల్పడుతున్నారు. ఈస్ట్‌జోన్ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. స్కూల్స్‌కు సెలవులు ఇవ్వటంతో సరదాగా పిల్లలతో పండుగలు చేసుకోవటానికి ఇళ్లకు తాళాలు వేసి చాలా మంది ఊళ్లకు వెళ్లుతుంటారు. తాళాలు వేసి వున్న ఇళ్లను టార్గెట్‌గా పెట్టుకుని దొంగలు తమ పనిని ఈజీగా చేసుకుని వెళ్లుతున్నారు. దొంగతనాలను అరికట్టడంలో పోలీసులు తగిన ప్రణాళికలు రూపొందించినా దొంగలు తమ పని ఈజీగా చేసుకునిపోతున్నారు. ఇంటి ఆవరణలో ఉన్న బట్టలు, సైకిళ్లు, వంటసామాన్లు, ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, ఆటోల టైర్లతోపాటు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారునగలు, విలువైన వస్తువులను దోచుకునిపోతున్నారు. చిన్న చిన్న వస్తువులే కదా అని చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటం లేదు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో పద్మారావునగర్, చిలకలగూడ, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బీదలబస్తీ, వారాసిగూడ, మేడిబావి, ఇందిరానగర్‌కాలనీ, బౌద్ధనగర్, అంబర్‌నగర్, లలితానగర్, పార్శీగుట్ట, గంగపుత్రకాలనీ, రాంనగర్, తదితర ప్రాంతాలున్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీధుల్లో సీసీ కెమెరాలు లేకపోవటం...పేద, మధ్య తరగతి కుటుంబాలు నివసించే ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో దొంగలు ఈ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారని సమాచారం. రోడ్డుమీద, ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలతోపాటు టైర్లతో పాటు బ్యాటరీలను విప్పి చోరీ చేస్తున్నారు. తెల్లవారు జామున వాకిళ్లు ఊడ్చే మహిళలతో పాటు ఒంటరిగా నడుచుకుని వెళ్లుతున్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఊరికి వెళ్లేటప్పుడు పక్కవారికి కాని, పోలీసులకు కాని సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఒక వేళ అత్యవసరం అయితే వెంటనే 100కు, లేకపోతే 040-2785 3597, 87126 60218, 87126 60558లకు ఫోన్ చేయాలని పోలీసులు కోరుతున్నారు.



ఊరికి వెళ్లేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిది

సంక్రాంతి సెలవులు పురస్కరించుకుని ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేటపుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించవచ్చని పోలీసులు చెబుతున్నారు. దొంగలు పలు ప్రాంతాలలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఇంటికి తాళం ముందు వేసుకోకుండా వెనుకవైపు వేసుకుంటే మంచిది. ఊరు వేళ్లే ముందు పక్కన నివశించేవారికి ఇంటిని చూడమని ఒకమాట చెబితే మంచిది. పోలీసులకు సమాచారం అందించినా ఫర్వాలేదు. ఇంటిలో బంగారు నగలను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలి. లాకర్ లేకపోతే విలువైన వస్తువులను ఇంటిలో ఉంచకూడదు. ఇంటి ముందు కుక్క ఉన్నది జాగ్రత్త అని బోర్డు పెట్టుకోవాలి. నాణ్యమైన తాళాలు ఇంటికి వేసుకుంటే మంచిది. ఇలా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలు నివారించవచ్చు.

ఊరికి వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందిస్తే మంచిది



సంక్రాంతికి ఊరికి వెళ్లే వారు స్థానికంగా ఉన్న పోలీసులకు సమాచారం అందిస్తే మంచిది. ఇప్పటికే ఏసీపీ చిలకలగూడ డివిజన్ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్లో పరిధిలో అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పోలీసుల గస్తీని పెంచాం. రాత్రిళ్లు ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పక్కా వివరాలను సేకరిస్తున్నాం. పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నచిన్న దొంగతనాలు జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. ఊళ్లకు వేళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

\- జైపాల్‌రెడ్డి, ఏసీపీ చిలకలగూడ డివిజన్

నేడు ప్రజాస్వామ్య విజయోత్సవ బహిరంగ సభ

- సభకు హాజరు కానున్న ప్రొఫెసర్ కోదండరాం
- నియంత పాలన ఓడింది ప్రజాస్వామ్య పాలన గెలిచింది
- ఎస్ యాదగిరి

అడ్డగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నియంత పాలన ఓడిందని, ప్రజాస్వామ్య పాలన గెలిచిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.యాదగిరి అన్నారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతుందని రేవంత్‌రెడ్డి సీఎం కావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య విజయోత్సవ సభ శుక్రవారం అడ్డగుట్ట చౌరస్తాలో అడ్డగుట్ట వ్యవస్థాపకులు స్వర్గీయ జీఎం అంజయ్య విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కోదండరాం పాల్గొంటారన్నారు. తాను రైల్వే ఉద్యోగం వదిలిపెట్టి ప్రజల సంక్షేమం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తపించిపోయి ఉద్యమాలు చేసిన వ్యక్తిగా ఉన్నానన్నారు. అడ్డగుట్ట భూకబ్జాదారుల చేతిలో పోకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లి కొట్లాడామన్నారు. అనేకసార్లు అడ్డగుట్ట స్థాపనకు జైలు పాలయ్యామన్నారు. ఒకవైపు తెలంగాణ కోసం పాటుపడితే మరో వైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలనతో లక్షల కోట్లు కూడబెట్టుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ తెస్తామన్న కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు తెరతీశారన్నారు. బహిరంగ సభకు మాజీ ఎంఎల్‌సీ రాములు నాయక్, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఆదం సంతోష్‌కుమార్, కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే గద్దర్ శ్రీవెన్నల, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

రైల్వేట్రాక్‌ను ఆనుకుని గోడను నిర్మించాలి

బౌద్ధనగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మేడిబావిలో రైల్వే ట్రాక్ వెంబడి ప్రహరీగోడను నిర్మించాలని స్థానికబస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ నుంచి ఆర్ట్స్‌కాలేజీ రైల్వేస్టేషన్ వరకు రైల్వే డిపార్ట్‌మెంట్ లూప్‌లైన్ (అదనపు) ట్రాక్‌ను నిర్మిస్తుంది. రైల్వే ట్రాక్ నిర్మాణపనులతో మట్టిపెళ్లలు వచ్చి మేడిబావి బస్తీలో పడుతుండటంతో రెండు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రైల్వేట్రాక్ నిర్మాణంతో చాలా ఇబ్బందులు పడుతున్న బస్తీవాసులు రెండురోజులుగా నూతన ట్రాక్‌పై ఆందోళనలు చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ మేడిబావిలో పర్యటించి నూతన ట్రాక్ పనులను చూసి రైల్వే అధికారులతో మాట్లాడారు.

వెంటనే బస్తీవాసులు ఇబ్బందులు పడకుండా ప్రహరీగోడను నిర్మించాలని కోరారు. రైల్వే అధికారులు నిర్లక్ష్యంగా మరల ట్రాక్ పనులు చేయటంతో బస్తీవాసులు అడ్డుకున్నారు. మేడిబావి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో రైల్వేలైన్స్ డీఎంతో పాటు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఐనా ఫలితం లేకపోవటంతో గురువారం నిర్మాణం చేపడుతున్న ట్రాక్ వద్ద బస్తీవాసులంతా ఆందోళనకు దిగారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌లు చొరవ తీసుకుని రైల్వే అధికారులతో మాట్లాడి ట్రాక్ వెంబడి ప్రహరీగోడను నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీనాయకులు స్వామ్రాట్ మల్లికార్జున్, అడ్వకేట్ శ్రీనివాస్, బోనగిరి శ్రీనివాస్, అనిత, రాణి తదితరులు పాల్గొన్నారు.


కొత్తగా చేపడుతున్న లూప్‌లైన్ ట్రాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మేడిబావివాసులు

పెద్దలు చెప్పేవి శ్రద్ధగా వినాలి

డిప్యూటీ ఈఓ చిరంజీవి

రాంగోపాల్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమాజం పట్ల ఎలా మెలగాలో పెద్దలు చెప్పినది విని శ్రద్ధగా నేర్చుకోవాలని సికింద్రాబాద్ డిప్యూటీ ఈఓ చిరంజీవి అన్నారు. గురువారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో జరగుతున్న తృతీయ సోపాన్ శిక్షణ శిబిరాన్ని డిప్యూటీ ఐఓఎస్‌లు రాథోడ్ సుమన్, కస్తూరి కుమారిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ జిల్లా కమిషనర్‌గా నియమితులైన చిరంజీవికి జిల్లా ట్రైనింగ్ కమిషనర్ విజయభాస్కర్, గైడ్స్ జిల్లా కమిషనర్‌గా నియమితులైన కస్తూరి కుమారికి గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ సంగీత పాండే, జిల్లా కబ్స్ కమిషనర్‌గా నియమించబడిన సుమన్ రాథోడ్‌కు గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ ఇందుమతిలు కమిషనర్ స్కార్ఫ్‌లను ధరింపచేశారు. అంతకు ముందు రోవర్, రేంజర్స్ కలర్ పార్టీతో స్కౌట్స్ గైడ్స్ గార్డ్ ఆఫ్ హానర్‌లతో స్వాగతం పలికారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ....ఈ మధ్య కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌటింగ్, గైడింగ్‌లు లేకుండా పోతున్నాయని, అవి తిరిగి పూర్వ వైభవం సాధించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని, తమ వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. సంస్థ కార్యక్రమాల గురించి జిల్లా చీఫ్ కమిషనర్ కేవీ దేవదత్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.రమేష్ చందర్, కోశాధికారి ఎం.రాజశేఖర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ కమిషనర్ అడల్ట్ రిసోర్సెస్ డాక్టర్ ఎంహెచ్ భతేనా, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ గౌరీనాథ్, స్కౌట్ మాస్టర్లు మల్లారెడ్డి, నాగేంద్ర, విష్ణుప్రసాద్, వనం రాజు, గైడ్ కెప్టెన్లు రూబీ కిరణ్, శిరీష, వెంకట శివలీల, స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రెంజర్స్ పాల్గొన్నారు.


స్కౌట్స్, గైడ్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చిరంజీవి

'సమస్యలను పరిష్కరించండి'

రాంగోపాల్‌పేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు గురువారం ఆమె డిప్యూటీ కమిషనర్ శంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో ముఖ్యంగా అరకొరగా విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులపై చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ్ ఆటోలు సరిగ్గా తిరగడంలేదని, వీధి లైట్లు 50శాతానికి పైగా వెలగడం లేదని, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే గత రెండు సంవత్సరాలుగా డివిజన్ పరిధిలో శాంక్షన్ అయినా అభివృద్ధి పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు.

ఇందుకు డీసీ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

బోయిన్‌పల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ ఒకటోవార్డు పరిధిలోని బాపూజీనగర్ ప్రధాన రహదారిపై ఉన్న నల్ల పోచమ్మ దేవాలయం, ఆరవ వార్డు పరిధిలోని కట్టమైసమ్మ దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ పూజా కార్యక్రమాలకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, రామారావు, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, అజిత్ కల్యాణ్, నరసింహ, జూరాల క్రాంతి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అమావాస్యను పురస్కరించుకుని కేబుల్ టీవీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కిషోర్, ప్రవీణ్ యాదవ్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్, సదానంద్ గౌడ్,హరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి :

లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి మహంకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డ్ మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్ సహకారంతో దాతల సహాయంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీ శంకర్, బోర్డ్ మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, రుక్మయ్య, పాండు, పి.రాజు, రాజారెడ్డి, ఉమేష్, విజయ్, దుర్గాప్రసాద్, అనురాధ రెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


బోయిన్‌పల్లి నల్లపోచమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న జంపన్న ప్రతాప్


అన్నదానం చేస్తున్న మాజీ బోర్డ్ సభ్యుడు శ్యామ్ కుమార్

వీడియో కాల్ చేసి ప్రాధేయపడినా..

- ఇంటికి రాని భర్త.. భార్య ఆత్మహత్య

గాజులరామారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. సూరారం సీఐ వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ఆర్‌జీకే కాలనీలో ఎస్‌కే ఫర్హానా(35) భర్త ఎస్‌కే ఖదీర్‌అలీ, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. వీరికి 2011లో వివాహమైంది. ఖదీర్ అలీ మద్యానికి బానిసై భార్యను కొంతకాలంగా వేధిస్తున్నాడు. తరచూ ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. గురువారం ఉదయం కుమార్తె స్కూల్ ఫీజు విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన ఖదీర్‌అలీ బయటకు వెళ్లిపోయాడు. భార్య ఫర్హానా వీడియో కాల్ చేసి ఇంటికి రమ్మని ప్రాధేయపడినా అతడు వినలేదు. మా అమ్మకు సారి చెప్తేనే వస్తానన్నాడు. మనస్తాపం చెందిన ఫర్హానా ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరికి గతంలో దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఘనంగా హనుమాన్ జయంతి

మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం తమిళ క్యాలెండర్ ప్రకారం హనుమాన్ జయంతి వేడుకలు దేవాలయ ధర్మాదాయ శాఖ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని వడమాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

\- మారేడ్‌పల్లి,ఆంధ్రజ్యోతి


ప్రత్యేక అలంకరణలో హనుమాన్

నాలుగు డబుల్ బెడ్‌రూంల సీజ్

అడ్డగుట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో కొందరు వ్యక్తులు డబుల్ బెడ్‌రూంలకు తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలకు తాళాలు వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమలంలో మారేడుపల్లి తహసిల్దార్ పద్మసుందరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తమ రెవెన్యూ పరిధిలోని ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో కొందరు ఇళ్లు రాలేదని ఇంటి తాళాలు పగులగొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సారీ మొదటి తప్పుగా భావిస్తూ మరో సారీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నాలుగు డబుల్ బెడ్‌రూంల వివాదాం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తమకు చెందిన నాలుగు ఇండ్లకు తాళాలు పగులగొట్టారని ఆరోపణలు రావడంతో ఈ నాలుగు బెడ్‌రూంలు ఇండ్లు ఎవరికి అనేది ఇంకా స్పష్టమైన విషయం తెలియదని, ఒక వేళ ఈ నాలుగు ఇళ్లు కూలగొట్టినవాళ్లయితే విచారణ జరుపుతామన్నారు. అనవసరంగా రాద్ధాంతం చేయవద్దని హెచ్చరించారు. ఈ నాలుగు ఇళ్లకు సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు.


డబుల్ బెడ్‌రూంకు తాళం వేసిన తహసీల్దార్ పద్మసుందరి, సిబ్బంది

మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..

- భారీ చెట్టు ఎక్కి యువకుడి హల్‌చల్

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..' అంటూ ఓ యువకుడు భారీ చెట్టు ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి అతడిని అతికష్టం మీద కిందికి దించారు. అతడి మాటలను బట్టి మతిస్థిమితం లేనట్లుగా గుర్తించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌టాకీస్ గల్లీ వద్ద ఓ యువకుడు అతిపెద్ద చెట్టు ఎక్కి, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చిలకలగూడ పోలీసులకు సమాచారమందింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్‌ఎస్సై బాలరాజు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. చెట్టు దిగమంటూ అతడిని కోరారు. చెట్టుపై ఉన్న యువకుడు ఏదేదో మాట్లాడుతున్నాడు. అతడిని మాటల్లో పెట్టి డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది క్రేన్ సహాయంతో కిందికి దించారు. వివరాలు అడిగితే తనపేరు రబీందర్, చత్తీస్‌గఢ్ అని చెప్పాడు. చెట్టు ఎందుకు ఎక్కావు అంటే తమ ఫ్యామిలీ చెట్టుపై ఉందంటూ ఇది నాగపూర్ కాదా.. అని పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడిని చాకచక్యంగా కిందికి దించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.


చెట్టుపై హల్‌చల్ చేస్తున్న యువకుడు